"పూనా వెళ్ళాలి. మరింక రాను"అన్నాను.

"ఊహూ! నువ్వు వెళ్ళొద్దు! నేనూ ఒస్తాను" అంది పట్టుదలగా. ఇంతో జ్యోతి తండ్రి ఒచ్చాడు.

"నేను వెళ్ళిపోవాలండి. మర్చిపోకండి"అన్నా.

"వెళ్ళిపోతున్నారా! మా జ్యో బెంగపెట్టుకుంటుందేమో?"అన్నాడు. జ్యో మమ్మీ టీతెచ్చి పెట్టూ, 'మీరు వెళ్లిపోతారా?'అన్నది. ఆమెగొంతుకలో వేదనధ్వనిస్తోంది. ఆమెకళ్లనీళ్ళతో నిండాయి.

"మీరేమీ అనుకోకపోతే ఒకటడుగుతాను" అన్నాను. "ఏమిటి బాబూ?"అంది.

"మీ కళ్ళనీళ్ళకు కారణంచెప్పరూ?"అన్నాను. ఆమె ఆపుకోలేక భోరున యేడ్చేసింది. జ్యో దిగులుగా వుండిపోయింది.

"క్షమించండి. మీకు కష్టం కలిగించానేమో."

"మా అబ్బాయి నీలాగే ఉండేవాడు బాబూ! మమ్మల్ని విడిచి వెళ్ళిపోయాడు. ఆరేళ్ళయింది. ప్రమోడుజీవితం అలవాటైంది"అన్నాడు గద్గదికంగా. నేను చాలా బాధపడ్డాను. "బాబూ! నీవెళ్ళిపోతే నేను, మా జ్యోకూడా ఉండలేం."అంటూ ఆవిడ ఏడ్చింది.

"బాబూ,నువ్వు వెళ్ళొద్దు"అంటూ నాకాళ్ళను చుట్టుకొంది. జ్యోకి ప్రజెంటుగా దంతపు బొమ్మనిచ్చాను. కొంతసేపు కూర్చున్నాక వెళ్ళొస్తానని చెప్పాను. జ్యో మమ్మీ, "మర్చిపోకు బాబూ!" అంది గద్గదికంగా. నా మనస్సువేదనతో నిండిపోయింది. జ్యో గేటువరకూ వచ్చి నిల్చుంది.

"వెళ్ళొస్తా జ్యో. బాగా చదువు, బాబూను మర్చిపోకు" అన్నాను. కళ్లు తుడుచుకుంటూ "బాబూ ఛీరియో"అంటూ చెయ్యిఊపింది. జ్యోను వదల్లేక, వదల్లేక చూస్తూ వచ్చేశాను. ఈ సంఘటన మరువరానిదైంది. నా జ్యో...చిన్నారి జ్యో మాత్రం స్మృతిపథంలో నిల్చిపోయింది.

---

కథానిక

# నవభారతంలో ఉద్యోగపర్వం

యర్రా మురళీ కృష్ణమోహన్

మా నాన్న స్కూలు ఫైనలుకూడా పాసుకాలేదు. అయితేనేం? తాలూకా గుమాస్తా. నేను బి. ఏ. పాసయ్యాను. కాని నాకు ఆ గుమాస్తా ఉద్యోగంకూడా దొరకలేదు. కవిత్వం చెప్పబోయి విమర్శలో పడ్డట్టు, గుమాస్తాగిరీకూడా కరువయ్యేసరికి ఇన్సూరెన్సులోకి దిగాను.

ఇన్సూరెన్సు పనిమీద ఆగ్రామం వెళ్లవలసి వచ్చింది. గ్రామం ప్రవేశించగానే 'కనకమహలక్ష్మి' కాఫీ హోటల్ కనిపించేసరికి నా ప్రాణాలు కుదుటబడ్డాయి. గ్రామమునసబుగారింటికి వెళ్లి నన్ను నేను ఎరుక పరుచుకొనేసరికి; ఆయన "నువ్వా! సర్వేశం! ఎప్పుడో ఇంతప్పుడు చూసాను. జ్ఞాపకమే లేదు. ఉద్యోగం చేస్తున్నావటగా? ఎంతిస్తారేంటి? అమ్మానాన్నా కులాసాయేనా? తాతయ్య వంట్లో ఆరోగ్యంగా వుంటోందా? ఆమధ్య మీ పూరొచ్చానులే; తాతయ్య వంట్లో కులాసా లేదన్నాడు." అంటూ ఆయనో ప్రశ్నల వర్షం కురిపించాడు. ఆయన ప్రశ్నలకు తాపీగా సమాధానాలు చెప్పాను. "లేమరి; ప్రొద్దుట ఎప్పుడు తాగావో కాఫీనీళ్లు" అని ఆయన అనేసరికి నా సమాధానాలకు తృప్తిపడ్డాడని అనుకొని భోజనానికి లేచాను.

ఆత్మారాముణ్ని సంతుష్టి పరిచేసరికి, నిద్రాదేవి ఆవహించింది. సాయంత్రం మూడుగంటలకు కాని వదల్లేదు ఆ మహాతల్లి. లేచి ఇన్ని కాఫీనీళ్లు పొట్టలోపోసుకొని వచ్చినపనేమిటో చూసుకొనేందుకు బయలుదేరాను-

పని ముగించుకొని తిరుగుముఖం పట్టేసరికి సంధ్యాసమయం అయింది. మంద మందలుగా వస్తూన్న గొడ్డుగోదలను తప్పించుకొంటూ, ఆకాశానికి చిన్న మేఘంలా లేస్తున్న గోధూళినుంచి నాశికను చేరుమాలుతో సంరక్షించుకొంటూ, చిన్నచిన్న మట్టిగడ్డలు కాబూలీషూలో దూరి గల్లంతుచేస్తూంటే నెమ్మదిగా నడకసాగిస్తూ

ఆసందుమలుపు తిరిగి రామాలయం సమీపించాను. అంటే; ఆ గ్రామం రాచబాటమీదకి అన్నమాట! మరో రెండడుగులు వేసేసరికి 'అజంతా ఫ్యాన్సీ స్టోర్సు' కనిపించింది. ఇంత చిన్నగ్రామంలో ఫ్యాన్సీ స్టోర్సు కూడానా అనుకొంటూ ముందుకు నడక సాగించాను ఆస్టోర్సు మీదుగా.

ఇంతలో "గిల్లెట్ బ్లేడులు లేవండి. సెవనో క్లాక్ ఇవ్వమన్నారా?" అన్నమాటలు వినబడే సరికి నాకాళ్లు ముందుకు నడవనన్నాయి. ఠకీమని ఆగి అటు చూడక తప్పలేదు. తీరా చూసేసరికి స్టోర్సులో సరుకు అమ్ముతున్నవాడు సుబ్బారావు. సుబ్బారావు నేనూ బి. ఏలో క్లాసుమేట్సుం. "గిల్లెట్ బ్లేడులున్నాయాండీ?" అంటూ స్టోర్సు లోకి వెళ్ళాను.

నన్ను చూడకుండా "లేవండీ, సెవెనోక్లాక్ ఇమ్మన్నారా?" అని నావంక చూశాడు సుబ్బారావు.

"ఓరి! నువ్వటరా, ఏరా సంగతి ఇలా ప్రత్యక్ష మయ్యావ్?" అన్నాడు.

"అది సరేలే; ఈ అవతారం ఏమిటిరా?"

"ఏంచెయ్యమన్నావురా, మన బి. ఎ. డిగ్రీ కనీసం నాలిక గీచుకోటానికికూడా పనికిరాకుండా పోయింది. ఇంతకీ మనం ఏంచేస్తున్నట్లు?" అన్నాడు వాడు. నే వచ్చిన కారణం కూడా చెప్పాను.

"వాళ్ళబ్బాయి నా స్నేహితుడే, వాడిద్వారా ప్రయత్నిద్దాం. పదినేలకు తక్కువకాకుండా చేస్తాడులే" అన్నాడు.

"అవునుకానీ, మీ మామయ్య తహశిల్దారు కదా ఏ తాలూకాలో అన్నా ఉద్యోగం చూడ లేకపోయావ్, ఇంతచదువూ చదివి..."

"ఏం లాభంలేదురా బ్రదర్, ఈ రోజుల్లో బంట్రోతు వుద్యోగానికికూడా మంత్రుల సిఫార్సు కావాలి"

"ఏడ్చినట్టుంది. మంత్రులే చేతిలోవుంటే వుద్యోగం ఏంకర్మం వూళ్ళే ఏల్దుం" అన్నాను.

"అందుకనే మనచేతిలో మంత్రుల్లేరు. తాలూకాఫీసులో అటెండర్ ఉద్యోగం దొరకలేదు మంత్రిగారి సిఫారసుతో— తెలుసా? నువ్వేదో వూళ్లేల్తా నంటున్నావ్!" అన్నాడు సుబ్బారావు.

నే నాశ్చర్యపోయాను మంత్రిసిఫారసులో అటెండర్ ఉద్యోగం దొరకలేదంటే.

"నే నమ్మనురా?" అనేశాను.

"అయితే విను" అంటూ ప్రారంభించాడు సుబ్బారావు. "సరిగ్గా సంవత్సరం క్రిందట ఇదే రోజుల్లో నేను మామయ్యగారింటికి వెళ్ళాను; ఇంట్లో మానాన్న ఉద్యోగం లేదన్నపోరు కొన్నాళ్ళయినా తప్పుతుందేమోనని. అక్కడ పగలు ఎలాగో గడిపేవాడ్ని, సాయంత్రం మామయ్యతో కలసి క్లబ్బుకి వెళ్తూండేవాడ్ని"

"ఓ రోజున మామయ్యా నేనూ క్లబ్బుకి వెళ్ళాం. వేపచెట్టుక్రింద సింహాసనాలమీద కూర్చుని క్లబ్బు మెంబర్లు బాతాఖానీ కొడ్తున్నారు. "గుడ్ మార్నింగ్ సార్! రెండురోజులనుంచి దర్శనాలేలేవు" అని క్లబ్బు బంట్రోతు ఎవరినో పలకరిస్తూంటే అంతా అటుతిరిగాం. ఇంతలో ఆయన మేం కూర్చున్నచోటుకి రానేవచ్చాడు. "గుడ్ మార్నింగ్!" అంటూ కూర్చున్నాడాయన.

"రెండు రోజులునుంచి రావటంలేదు" అన్నాడొకాయన.

"ఆఁ! ఏముంది మా ఆఫీసులో ఓ ఉద్యోగం ఖాళీ అయింది. అది భర్తీచేసేసరికి తలప్రాణం తోక్కొచ్చింది" అన్నాడా పెద్దమనిషి.

"వెనకటికి ఒకాయన పంచదార తిని నోరంతా కడుక్కున్నాట!...ఉద్యోగం ఖాళీ అయిందట, కోస్తే తెగాలి!" అన్నాడొకమెంబరు.

"వేలకొద్దీజనం ఉద్యోగాలులేక సతమతమయి పోతూంటే సంవత్సరానికి పద్దెనిమిదిలక్షలమంది నిరుద్యోగులు మాన్యుఫేక్చర్ అవుతున్నారని పత్రికలవాళ్ళు కాటికాయలంత అక్షరాలతో పేపర్లలో ప్రచురిస్తూన్న ఈ రోజుల్లో, అందులోనూ గవర్నమెంటు వుద్యోగానికి ఒక్కడు దొరకలేదూ?" అంటూ తన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు మరోమెంబరు.

"ఆఁ! అక్కడేవచ్చింది చిక్కు. ఒకడూ ఇద్దరూ అయితే బాధలేదు, వేలమంది తయారవుతుంటే—ఏంచెయ్యటం?" అన్నాడా పెద్దమనిషి.

"ఎవడికో ఓ ఆకాశరామన్నకు పారేస్తే పోయేదానికి పెద్ద బ్రహ్మకార్యంగా చెబుతున్నావేమిటె మహా" అన్నాడొకమెంబరు.

"నే చెప్పేది పూర్తిగా వింటే నే పడ్డ అవస్థ మీకే తెలుస్తుంది" అంటూ చెప్పటం ప్రారంభించాడా పెద్దమనిషి.

"నెలక్రిందటే అందరికీ తెలిసిపోయింది మా ఆఫీసులో అటెండరు రిటైరు అవుతాడని; ఇక చూడండి, అప్పటినుంచీ ప్రారంభమయ్యాయి ధరఖాస్తులు. రెండువందల ఎనభైమంది అప్లయిచేసారు. ఈ ముండకలాపి అటెండర్ వుద్యోగానికి ఒక మంత్రి సిఫారసు తెచ్చాడు ఒక ఘనుడు. చేర్మన్ సిఫారసు మరొకడు.. జిల్లాకలెక్టర్ గారి అల్లుడు మేనత్తకొడుకు ఒకడు, ఇలా అంతా గెజిటెడ్ ఆఫీసర్ రేంకుకి తక్కువకాని ఆఫీసర్ల దగ్గరనుంచి సిఫార్సు తెచ్చారు.

ఇక, మా బావమరిది బ్రహ్మానందం మాట చెప్పనే అక్కరలేదు. తన స్నేహితుడు తాలూకూ ఎవరినో తీసుకువచ్చాడు ఎకాఎకీని. ఆ ఉద్యోగం ఇస్తావా చస్తావా అని కూర్చున్నాడు. ఉద్యోగం ఇవ్వకపోతే ఇక మా వూళ్ళో నాకేం పరువు వుండదు. ఏమయినాసరే ఈ ఉద్యోగం మావాడికి ఇవ్వకతప్పదు" అని బైఠాయించాడు.

సంగతి అంతాచెప్పి మంత్రిగారి ఉత్తరంకూడా చూపించాను.

"మంత్రిగారికి కోపంవచ్చి నా ఉద్యోగ ఏమయినా అయితేనో?"

"అయితే మా ఇంటికిరా, నిక్షేపంగా పోషిస్తాను. ఏమయినాసరే ఉద్యోగం మావాడికి ఇవ్వాల్సిందే. లేకపోతే ఇక నీకూ నాకూ ఇంతే-" అన్నాడు మా బావమరిది.

"ఇది ఇలావుండగా బి. ఏ. డిగ్రీతో ఒక మహానుభావుడు వచ్చాడు ఈ అటెండర్ ఉద్యోగానికి. అతన్నిచూస్తే ఏడుపు వచ్చేంత పనయింది నాకు. అతనిస్థితి అంత హృదయ విదారకంగా వుంది. ఏమీ అనలేక చూస్తాలెండి" అన్నాను.

"ఆఫీసర్లకి అలా అనటం మామూలే మీరు మాట ఇస్తేకాని వెళ్ళను" అన్నాడతను.

మాటివ్వకుండా అతన్ని వదిలించుకునేసరికి చచ్చినంత పనయింది. ఇక పోతే మా ఆఫీసు గుమాస్తాలు, బంట్రోతులు తలా ఒకడిని తీసుకొచ్చారు. అందరికీ తలూపి పంపించేసాను. "ఇప్పుడు చెప్పండి ఎవరికీ వుద్యోగం ఇవ్వాలో?" అన్నాడా పెద్దమనిషి.

మెంబర్లంతా ముఖాలు చూసుకొన్నారు. కొంచెం ఆగి కొందరు మంత్రిగారి సిఫారసు తెచ్చిన వ్యక్తికి ఇవ్వాలన్నారు. కొందరు గ్రాడ్యుయేట్ కి ఇవ్వాలన్నారు.

'ఇంతకీ ఎవరికిచ్చావ్? ఏదో వేస్తావ్ చాణక్య తంత్రం. నువ్వా నాయనా, దేవాంతకుడివి" అన్నాడొక మెంబరు. ఆయన నవ్వి ఇలా అన్నాడు. "ఉద్యోగం ఒకరికిస్తే మరొకరికి కోపతాపాలు కలుగవచ్చు. అందుచేత ధరఖాస్తు పెట్టిన ఏ ఒక్కరికీ ఇవ్వకుండా పూర్తిచెయ్యాలి, ధరఖాస్తు పెట్టనివాడికి ఇవ్వటం అనుచితం ఎలా రాభగవంతుడా అని రెండురోజులు ఆలోచించాను. "స్త్రీసాహసం" సినిమా జ్ఞాపకం వచ్చింది—గోడ మీద వాల్ పోస్టర్ చూశాక. పెళ్ళికాకుండా రాకుమారి పిల్లాడిని ఎలా కన్నదో గుర్తు వచ్చేసరికి, ఇలాంటి సమస్యలు ఏదో గారడీ చెయ్యక పోతే పరిష్కారం కావని తేలింది. ఈవేళ ఇంటికి వెళ్లి ఇంత కాఫీ ఒక్క సిగరెట్ దమ్ము లాగేసరికి ఆలోచన తట్టింది. ఆలోచనంటే సామాన్యమా? బ్రహ్మాండమయిన పథకం! వెంటనే మళ్లీ ఆఫీసుకు వెళ్లి ఉద్యోగం వేసేసి ఆర్డరుమీద సంతకంపెట్టి ఇలా వచ్చాను."

"ఇంతకీ ఎవరికిచ్చారు?" అన్నారు మెంబర్లు.

"ఈ ఉద్యోగం కొత్తవాళ్లకి ఇవ్వటానికి వీల్లేదు, ఇది ఆఫీసు వాళ్లకే అనిచెప్పి మా ఆఫీసు బంట్రోతును అటెండరుగా వేసి, బంట్రోతు నౌఖరీ ఖాళీ చూపించాను. ఆదెబ్బతో అంతా జారుకున్నారు. కానీ బి. ఏ. అతనుమాత్రం వదల్లేదు అదయినా ఇవ్వమన్నాడు. నేనూ బి. ఏ. నేకావటంవలన మీకీ ఉద్యోగం ఇవ్వటానికి నాకు మనస్కరించటంలేదని అతనికి చెప్పాను "ఆ మాటలకి అతను కళ్లనీళ్లు పెట్టుకొని "అంత అభిమానంవుంటే ముందీవుద్యోగం ఇవ్వండి" అన్నాడు. వెంటనే అతనికి అప్పాయింట్ మెంట్ ఆర్డరు ఇచ్చి యిలా వచ్చాను." అంటూ ఆగాడాయన.

తక్కిన వాళ్లంతా నోళ్లు తెరుచుకుని అలా చూస్తూవుండి పోయారు." అంటూ కథ ముగించాడు సుబ్బాబావు.

★